కథ

# పరుగు

- సలీం



వింటిని వదిలిన బాణంలా పరుగెత్తుతోంది కీర్తి. పళ్లు బిగపట్టి... ప్రాణ శక్తినంతా పిక్కల్లో నింపేసి... గాలితో పోటీ పడ్తూ... పోటీ... తను గెలవాలి... తన జీవిత లక్ష్యం అదే.. ఎదురుగా అవరోధాలు... హర్డిల్స్... వూపిరి తిత్తులనిండా గాలి పీల్చి లాఘవంగా జంప్ చేసింది. మళ్ళా పరుగు... స్టేడియం నిండా మనుషులు...

తను పరుగెత్తుతూనే ఉంది.... వూపిరందడంలేదు. ప్రాణం పోయేలా ఉంది. ఐనా సరే పరుగాపకూడదు. చుట్టూతా మనుషులు మాయం... నిర్మానుష్యంగా ఉంది... అడవిలా... వెంటపడి తరుముతున్నాడు వివేక్... పేరెలా పెట్టారో చూడు... అవివేక్‌అని పెట్టాల్సింది... వీడి నీచత్వాన్ని వర్ణించడానికి ఆ పేరు కూడా సరిపోదు... దొరికితే కొరికేస్తాడు... వాడి పళ్ళనిండా విషం... పిచ్చికుక్క...

మరలా హర్డిల్స్... జంప్ చేసి తప్పించుకుంది. వాడు అరుస్తున్నాడు. ఆగకపోతే చంపేస్తాడట. కానీ ఆ గొంతు వివేక్‌ది కాదు... ఈశ్వర్‌ది. ఎవరెవరివో గొంతులు.. కలిసిపోయి... కలగాపులగమై... తోడేళ్ళ గుంపు... ఏ కండకా కండ చీల్చి రక్తం తాగాలనే ఆరాటంతో... దొరక్కూడదు... పరుగెత్తాలి... పతకం అందుకోవాలి... అదిగో పదడుగుల్లో ఫినిషింగ్ లైన్... పతకం తనదే... వాళ్ళకు దొరికితే పతనం తనదే... పతనమా పతకమా... పతనంతో పతకమా... పతకంతో పతనమా...

కాలు మడతపడింది... మడతపడింది కాలా జీవితమా? పడిపోయింది... చుట్టూతా కుక్కలు... పీక్కుతింటూ... ప్లీజ్.... పిక్కలు వదిలేయండి... పతకం గెల్చుకోవాలంటే నా కాళ్ళే ఆధారం... దండం పెడ్తాను... నా పిక్కలు... నా కాళ్లు.... నా పతకం... కీర్తి ఏడుస్తోంది... పెద్దగా ఏడుస్తోంది... హృదయం ద్రవించేలా ఏడుస్తోంది.

కుక్కలకు హృదయం ఉండదు... తోడేళ్ళకూ ఉండదు.. రక్తపు విందు వాటికి... తన ప్రాణం పోతోంది. పతకం సాధించకుండానే తను చచ్చిపోతోంది. చావకూడదు... తను బతకాలి. ఒక్కసారిగా బలంగా విదిలించింది.

చప్పున మెలకువొచ్చింది. కీర్తి భయం

భయంగా చుట్టూ చూసింది. కుక్కలు లేవు. తన ఒంటిమీద రక్తపు గాయాలు లేవు. గుండెలో దాచుకున్న గాయాలు బైటికి కన్పడవు. తను యింట్లో ఉంది. తనింట్లో... తన మంచం మీద... వళ్ళంతా చెమటతో తడిచిపోయింది... స్నానం చేసినట్లు.

స్నానం చేసి తొందరగా తయారు కావాలి. రమ వస్తానంది. గోడ గడియారం వైపు చూసింది. రంగు వెలిసిపోయి, పెచ్చులూడిపోయిన గోడ మీద ముసిల్దయిపోయి తన చావు ముహూర్తానికి నిమిషాలు లెక్కిస్తున్న గడియారం... సమయం ఆరూ యాభై తొమ్మిది... ఏడు కావడానికింకా నిమిషమే ఉంది.

కీర్తి గడియారం వైపు భయంగా చూసింది. యింకొన్ని క్షణాల్లో ఏడవుతుంది. చెవుల్ని గట్టిగా మూసుకుని చూపు కిందికి దించింది. పేల బోతుంది డైనమైట్ అన్నంతగా భయంతో వణికి పోయింది. గడియారం ఏడుసార్లు బలహీనంగా మూలిగింది. ఏడాది క్రితం ఈ గడియారం ఏడు గంటలు కొట్టి ఆగగానే అమ్మ గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. ఏడ్పులు.. కన్నీళ్ళ వరద యిల్లంతా...

అమ్మ.... చిన్నప్పుడు పరుగెత్తినపుడల్లా 'పడి పోతావు... జాగ్రత్త తల్లీ' అని హెచ్చరించిన అమ్మ... పడిపోయినపుడు ఎత్తుకుని సేదతీర్చిన అమ్మ... జీవితంలో పడిపోకుండా ఉండాలంటే ఏం చేయాలో నేర్పిన అమ్మ... మగ మృగాలనించి ఎలా తప్పించుకోవాలో నేర్పిన అమ్మ... యిపుడు లేదు. తన రక్షా కవచం జారిపోయింది. తనిప్పుడు అనాచ్ఛాదిత...

భయం భయంగా తనవైపుకు చూసుకుంది. బట్టలు నిండుగా ఉన్నాయి. యిలానే కదూ తను మొదటిసారి భయపడింది... తనని వివస్త్రని చేసినపుడు... పట్టుమని పదహారేళ్లు కూడా ఉండవు. పిచ్చి అమ్మ.. మృగాల గురించి చెప్తే తను వాటికి కోరలు, కొమ్ములూ ఉంటాయనుకుంది. మృగాలూ నవ్వుతాయని , మృదువుగా మాట్లాడ్తాయని, అవకాశం దొరగ్గానే కండల్ని చీలుస్తాయనీ, రక్తం పీలుస్తాయని అమ్మ చెప్పటం మర్చిపోయి ఉంటుంది.



కీర్తి తలయెత్తి గడియారం వైపు చూసింది. ఏడు గంటల మూడు నిమిషాలు.. హమ్మయ్య... అది మోగించే ఏడు గంటలు యముని మహిషపు లోహ గంటల్లా అన్పిస్తాయి. దాన్ని విసిరి పారేయాలని చాలాసార్లే అనుకుంది. కానీ మనసొప్పలా. అది నాన్న జ్ఞాపకం.

తను తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు చచ్చిపోయిన నాన్న... కౌలుకు తీసుకున్న పొలానికి నీళ్లు పెట్టడానికి సగం రాత్రిలో పొలానికెళ్లి, తిరిగొస్తూ పాము కాటేసి చచ్చిపోయాడు. అందుకే తనకు చిన్నప్పటి నుండి పాములంటే భయం... పిచ్చిదానిలా పాములు పుట్టల్లోనో, పొదల్లోనో, పొలాల గట్లమీదో ఉంటాయనుకుంది తప్ప రెండు కాళ్ళతో యధేచ్ఛగా రోడ్లమీద తిరుగాడుతుంటాయని తెలీని వయసు. తెలిసేప్పటికి ఎన్నెన్ని కాట్లో... ఎన్నెన్ని గాట్లో... వంటినిండా పాకుతూ విషం.,...

ఎనిమిదో తరగతి చదువుతున్నప్పుడు స్కూల్లో పరుగు పందేలు పెట్టారు. తనే ఫస్ట్ వచ్చింది. బహుమతిగా పెన్సిల్ యిస్తే పరుగెత్తు కుంటూ వచ్చి నాన్నకి చూపించింది.

'నీ క్లాసు మొత్తానికి ఫస్టా' అని అడిగితే 'కాదు నాన్నా.. .మా స్కూలు మొత్తానికీ ఫస్ట్. టెన్త్‌క్లాస్ వాళ్ళని కూడా ఓడించేశాను తెలుసా' అంటుంటే విని మురిసిపోయిన నాన్న.

'మీ కీర్తి పరుగుపెట్టే విధానం, ఆ వేగం చూస్తుంటే గేమ్స్‌లో బాగా రాణించేలా ఉంది. చదువుతోపాటు పరుగుమీద ధ్యాస పెట్టమనండి. అవసరమైన తర్ఫీదు నేనిస్తాను. నా మాట నమ్మండి. ఏదో ఓ రోజు కీర్తి నేషనల్ ఛాంపియన్ అవుతుంది. తన పేరుకి తగ్గట్లే మీకూ, మన వూరికీ కీర్తిని తెచ్చి పెడ్తుంది' అంటూ పీ.టీ సార్ గుర్నాధం గారు చెప్పిన మాటలు విని కలల్లో తేలిపోయిన నాన్న.

గుర్నాధం గారి మాటలు గుర్తు చేసుకుంటూ కన్పించిన ప్రతోడితో 'నా కూతురు పీటీ ఉషలా పరుగుల రాణి తెలుసా...' అంటూ గర్వంగా ఛాతీ పొంగించి మాట్లాడిన నాన్న... తన పుట్టినరోజు నాడు బహుమతిగా పట్నం వెళ్ళి ఆ గడియారం కొనుక్కొచ్చాడు. 'ఆ సెంకడ్ల ముల్లు చూశావా ఎలా పరుగెత్తుతుందో... ఆగకుండా... నా కూతురు కూడా అలా పరుగెత్తాల... కాలంతో పోటీ పడాల... దీన్ని చూసినప్పుడల్లా నీకు పరుగే గుర్తుకు రావాల... నువ్వు పతకం గెలవాల... నా కలని నిజం చేయాల' అని చేతిలో చేయి వేయించుకున్న నాన్న అర్థాంతరంగా చనిపోతే బతుకంతా చీకటైనట్లు అన్పించింది. గాఢాంధకారం... దిక్కు తోచని స్థితి... అటువంటి పరిస్థితుల్లో తనని నడిపించిన చిన్ని దీపం గుర్నాధంగారు.

'యింకా తెమల్లేదా... ఎనిమిదిన్నర. కానివ్వ



తల్లీ... మళ్ళా ఆలస్యమైతే మొగుడూర్కోడు' వస్తూనే అంది రమ. పెళ్ళి కాని రమ. తనతోపాటు పదోతరగతి వరకు చదివిన రమ... సన్నగా నాజూగ్గా జాజిమొగ్గలా అందంగా ఎదిగిన రమ. ఖరీదైన డ్రెస్సులూ, ఫారెన్ సెంట్లు, వారానికోసారి బ్యూటీపార్లర్‌లో ఫేసియల్లూ మసాజ్‌లు... మేక్ ఎకే నెలకు నాలుగైదు వేలు ఖర్చు చేసే రమకు తను పన్చేసే షాపు వాడిచ్చే జీతం ఆరువేలు.

'పన్లోకెళ్ళకున్నా నా ఆరువేలు యిచ్చేస్తాడే. షాపు ఓనర్ లేడూ... బట్టతలగాడు. వాణ్ణి పటాయించా. కాల్తో తన్నినా కిక్కురుమనడు. వాడి మిగిలిన జుట్టు నా పిడికిట్లో' అంటూ విలాసంగా నవ్వే రమ.

'అయ్యో తప్పు కదా' అంటే

'తప్పా పాడా... నువ్వు పరుగెత్తేటప్పుడు నీలో కసి ఉంది చూడు... నాకూ కసి... ఈ పేదరికం మీద... ఈ డబ్బున్నవాళ్ళమీద... తుపుక్కున ఉమ్మేయాలనిపిస్తుంది తెలుసా... నా అందం, నా యవ్వనం ఎరగా వేసి వాళ్ళని కుక్కల్లా నా కాళ్ళ చుట్టు తిప్పుకుంటున్నానే' అంటున్నప్పుడు రమ శ్వాస బుసలా విన్పిస్తుంది.

కుక్కలు కాళ్ళ చుట్టూ తిరిగేవే కాదు.. మెడ కొరికేసేవి కూడా ఉంటాయి. పిక్కల్ని చీల్చి... పరుగెత్తకుండా చేసి... మెల్లగా ఒక్కో శరీర భాగాన్ని నెమ్మదిగా నమిలి తినేసే కుక్కలు...

కీర్తి త్వరగా స్నానం చేసి అరగంటలో తయారైంది. బస్సెక్కి పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్నానికి ప్రయాణం... తను పదో తరగతిలో ఉన్నప్పుడు గుర్నాధంగారు ఈ పట్నానికే పిల్చుకొచ్చి హాస్టల్లో జాయిన్ చేశారు. తన కోచ్ వివేక్... మెస్‌లో పెట్టే ముక్కిపోయిన బియ్యంతో వండిన అన్నం... పప్పు చారు అమృతంలా అన్పించేది. గంజినీళ్ళయినా తాగిందో లేదో నని అమ్మని తల్చుకుని దిగులేసేది.

'దిగులు పడకు.. నీకు నేనున్నాను. నిన్ను స్టార్‌ని చేస్తాను' అన్నాడు వివేక్.

'నాకు స్టార్ కావాలని లేదు. రన్నింగ్ రేస్‌లో నేషనల్ ఛాంపియన్ కావాలని ఉంది. పతకం గెలిచి మా నాన్న కోరిక తీర్చాలని ఉంది' అని తను అన్నప్పుడు తన భుజాల చుట్టూ చేతులేసి నిమురుతూ 'నాతో సహకరించు చాలు. నేనేమడిగినా నో అనకు. నీ మెళ్లో గోల్డ్ మెడల్ పడే వరకు నిద్రపోను' అంటూ చాలా రాత్రుళ్ళు నిద్ర పోనివ్వకుండా తన శరీరంతో ఆడుకున్న వివేక్...

పన్నెండేళ్ళ వయసులో చింతపండు కొనుక్కు రమ్మని అమ్మ పంపిస్తే పచారికొట్టు కెళ్ళింది. యాభై ఆరేళ్ళ రంగనాయకులు చింతపండు వెనక గదిలో ఉంది రమ్మని పిల్చుకెళ్ళి... బియ్యం బస్తాల చాటున... మసక చీకట్లో తన ఎదిగీ ఎదగని వక్షాన్ని పట్టుకుని నలిపినప్పుడు కలిగిన బాధ... వ్రణంలా సలుపుతూ.. పదహారేళ్ళు వచ్చాక వివేక్ తన అసహాయత్వాన్ని, పేదరికాన్ని, అవసరాన్ని ఆసరాగా చేసుకుని చేసిన గాయాలు గుండెల్లో మోస్తూ... ట్రాక్ మీద పరుగెత్తినపుడు నేలమీద ఎన్ని రక్తపు పాదముద్రలో..

"యిక ఆపుతావా నీ ఆలోచనల పరుగు... నీతో చచ్చిపోతున్నానే... ట్రాక్‌మీద పరుగెత్తటం ఆపి చాలా ఏళ్ళయిందిగా. ఈ ఆలోచనల పరుక్కూడా ఆపు తల్లీ... నేను నీలా పరుగుల రాణిని కాదు. పట్టుకోలేను" అంది బస్ దిగుతూ.

రద్దీగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో 'ఈవ్' అని రాసున్న షాపులోకి పిల్చుకెళ్ళింది. క్యాష్ కౌంటర్లో నలభైయేళ్ళ వ్యక్తి కూచుని ఉన్నాడు. తెల్లగా లావుగా ఉన్నాడతను. పాన్ నమలటం వల్లేమో పళ్ళు గార పట్టి ఉన్నాయి స్త్రీలకు కాస్మెటిక్స్‌తో పాటు అండర్ గార్మెంట్స్ అమ్మే ఆ షాపులో ముగ్గురు అందమైన సేల్స్ గరల్స్ ఉన్నారు.

"సర్... నేను చెప్పానే... ఈ అమ్మాయి గురించే" అంది రమ.

అతని చూపు మొదట తన మొహాన్ని తర్వాత తన గుండెల్ని తడమటం కీర్తి గమనించింది.

అతను గుండెలమీంచి చూపు తిప్పుకోకుండానే "రేపట్నుంచి రమ్మను. జీతం మొదట నాలుగువేలిస్తాను. అమ్మకాలమీద కమీషన్ యిస్తాను" అన్నాడు. కీర్తికి వంటినిండా సహస్రపాద జంతువేదో పాకుతున్నట్లనిపించింది. షాపులో ఉన్న ముగ్గురు అమ్మాయిల వయసు యిరవై యేళ్ళ లోపే ఉంటుంది... ఓ మోస్తరు అందగత్తెలే.. సేల్స్ గరల్స్ అంటే సేల్ చేసే అమ్మాయిలా లేక 'వాళ్ళే ఫర్ సేల్' అని అర్థమా...

"నాలుగు వేలు చాలా తక్కువ సేటూ.. తను రన్నింగ్‌లో స్టేట్ ఛాంపియన్ తెలుసా" అంది రమ.

"నాకు వేగంగా పరుగెత్తేవాళ్ళు కాదు కావల్సింది. యిక్కడ నిలబడి పన్చేసేవాళ్లు. జీతం విషయం చూద్దాంలే... తను చేసే పని నాకు నచ్చితే ఎక్కువ జీతమిస్తాను" అన్నాడు.

వాడి ఆకలి చూపులు తన శరీరంలోని ఎత్తు పల్లాల మీద పరుగు పెడ్తున్నాయి... పని నచ్చితే జీతం పెంచుతాడట... ఏ పనో... ఎలా చొంగ కారుస్తున్నాడో... ఆ పనే వాడికి కావల్సింది... అందుకే అక్కడ పన్చేస్తున్న ముగ్గురమ్మాయిల మొహాల్లో జీవకళ లేదు. వీడు ప్రాణాల్ని కొద్ది కొద్దిగా నంజుకు తింటూ కదుల్తున్న మృతశరీరాల్లా మారక ఏం చేస్తారు పాపం...

బైటికొచ్చాక "రేపట్నుంచి జాయినైపోవే" అంది రమ.


పాపం రమని చూసి జాలేసింది కీర్తికి. యిప్పటికి నాలుగు ఉద్యోగాలు, చూపించింది. యిది ఐదోది. కొన్ని రోజులు పన్చేయటం.. ఓనర్‌గాడు కోరలు కోరికలు బైటపెట్టడం.. తన శరీరం మీద వాడికేదో హక్కున్నట్లు చేతులేయటం... తను ఛీకొట్టి బైటికి రావటం...

"వీడూ అలానే ఉన్నాడే" అంది కీర్తి.

"నాకు తెలిసి అందరూ అలానే ఉంటారు. అడగంగానే ఉద్యోగం యిస్తానని ఎందుకన్నాడనుకున్నావు? వాడితో రెండు మూడుసార్లు గడిపాన్లే... ఆ పరిచయం. ఏ మాట కామాట చెప్పాలి. డబ్బులు బాగానే యిస్తాడు" అంటూ నవ్వింది రమ.

"అలాంటి వాడని తెలిసి ఎందుకు పిల్చుకొచ్చావు?"

"సర్లె... నేనేమైనా పెద్ద ఆఫీసర్నా నా రికమండేషన్తో ఉద్యోగం యిప్పించడానికి? నేనేం చేస్తానో నీకు తెలుసు.. నాకున్న పరిచయాల్తోటే నీకో



ఆసరా కల్పించడానికి ప్రయత్నిస్తున్నా''

''నాకో విషయం అర్థం కావటం లేదు. వీళ్లు జీతం యిచ్చేది షాపులో పన్చేసినందుకా లేక వీళ్ళకు బానిసల్లా మారి మన శరీరాల్తో ఆడుకోనిచ్చినందుకా?''

రమ నవ్వి, ''పదవే. హోటల్కెళ్ళి కాఫీ తాగుదాం'' అంది.

కాఫీ ఘుమఘుమ... జిహ్వ లేచొస్తోంది. రాత్రి కూడా ఏం తిన్లేదు.. ఆకలి...

''నేనింతకు ముందు చాలాసార్లు చెప్పాను. మళ్ళా చెప్తున్నాను విను నువ్వు స్టేట్ ఛాంపియన్ అయ్యే క్రమంలో ఎవ్వరికీ లొంగకుండానే ఐనావా... నువ్వు ఔనని చెప్పినా నేను నమ్మను. యిలా నాలుగైదు వేల కోసం నెలంతా వళ్లు హూనం చేసుకుని, ఆ ఉద్యోగం నిల్పుకోవటం కోసం వాడికి శరీరాన్ని అర్పించే బదులు నా దారికి రా... సరదాకి సరదా... డబ్బుకి డబ్బు'' అంది రమ.

డబ్బుకోసం పరాయివాడికి శరీరాన్ని పంచటం సరదానా... చావుతో సమానం... వివేక్ తన శరీరాన్ని బలవంతంగా లొంగదీసుకున్నప్పుడు తనే చనిపోయిందిగా... వాడు తన శవంతో కోరిక తీర్చుకున్నాడు... ఆ తర్వాత కూడా వాడు అనుభవించింది తన మృత శరీరాన్నే... ఆత్మ లేని శరీరం... ఆత్మ చచ్చిపోయిన శరీరం... మనసు మసైపోయిన శరీరం... జీవితం కాలి బూడిదయిపోయాక మిగిలిన మృత్తిక... మట్టి... బురద... అంతా బురద... దుర్గంధం...

''యిక్కడికి దగ్గర్లోనే దుర్గా లాడ్జుంది. దాని ఓనర్కి చెప్తే చాలు అన్నీ వాడే చూసుకుంటాడు. కష్టమర్లని కూడా వాడే మాట్లాడి పెడ్తాడు. ఫ్రీ సర్వీస్ కాదులే... ట్వంటీ ఫైవ్ పర్సెంట్ కమీషన్ తీసుకుంటాడు. అంతే. పోలీసులతో లావాదేవీలు కూడా వాడి బాధ్యతే. మనకు సేఫ్... ఆలోచించి చెప్పు. నెలకు పది పదిహేను వేలు గ్యారంటీ'' అంది.

కీర్తిని బస్సెక్కించి ఎవరో కష్టమర్ని కల్సుకోవాలని వెళ్ళిపోయింది రమ.

యింటికొచ్చిన క్షణం నుంచీ ఆలోచనలు పరుగులు పెడ్తున్నాయి... వాటి వేగాన్ని అందుకోలేక పోతోంది కీర్తి...

'నువ్వు స్టేట్ ఛాంపియన్ అయ్యే క్రమంలో ఎవ్వరికీ లొంగలేదా చెప్పు?'

ఎందుకు లొంగలేదు? లొంగిందా... కాదు..... లొంగదీసుకున్నారు. ఆ వివేక్గాడు... మొట్టమొదటి సారి వాడు భుజంమీద వేసిన చేతిని కుడి వక్షం మీదికి జార్చినపుడు తను భయంతో ముడుచుకుపోయింది. వాడు తోడేలు.. తనో... బలహీనమైన కుందేలు పిల్ల... వాడి నోటికి చిక్కకుండా అన్ని ప్రయత్నాలూ చేసింది.

వాడు కోపంతో రగిలిపోయాడు. నీ జీవితాన్ని కుక్కలు చింపిన విస్తరి చేస్తానన్నాడు. నువ్వు అథ్లెటిక్స్కి పనికి రాకుండా చేస్తానన్నాడు. కాళ్లు ఇరగ్గొట్టి అవిటిదాన్ని చేసి యింటికి పార్శెల్ చేస్తానన్నాడు. యింటి దగ్గర కూలి పనుల్తో పొట్టపోసుకుంటున్న అమ్మ గుర్తొచ్చింది. పాము కాటుతో చచ్చిపోయిన నాన్న గుర్తొచ్చాడు. నాన్నకి తనిచ్చిన మాట గుర్తొచ్చింది.


తను పతకం సాధించాలి. ట్రాక్మీద తన నిర్జీవ శరీరం పరుగెత్తినా సరే. తను ఛాంపియన్ కావాలి. అందుకే చచ్చిపోయింది. వాడు ఆడుకుంటూ 'యిక పతకం నీదే' అన్నప్పుడు పళ్ళు బిగువున దుఃఖాన్ని భరించింది. వాడు తనని వివస్త్రని చేస్తూ 'నీకు ట్రాక్ మీద తిరుగుండదు' అన్నప్పుడు గుండెల్లో స్క్రూడ్రైవర్లు తిరుగుతున్నంత బాధని సహించింది.

జిల్లాస్థాయి పోటీల్లో ఫస్టొచ్చింది. స్టేట్ కాంపిటీషన్కి సెలెక్టర్గా ఉన్న ఈశ్వర్ ఆ రాత్రి యింటికొచ్చి కల్సుకొమ్మన్నాడు. తను వెళ్ళనంది. వివేక్కి చెప్పుకుని ఏడ్చింది. పులి మేకపిల్ల కథలో తన కన్నీళ్ళతో పులిపాదాలు కడిగిన మేకపిల్లలా... పులికి పులి సాయం చేయకుండా ఉంటుందా... తోడేళ్ళ గుంపులో కన్నీళ్ళకు విలువుంటుందా?

చేతికందబోతున్న పతకాన్ని కాలదన్నుకుంటున్న మూర్ఖురాలివన్నాడు వివేక్. నా నోటికందకుండా జారిపోతే జాలనేది లేకుండా కాలికిందేసి తొక్కేస్తానన్నాడు. కోరిక తీరిస్తే నీ జాతకమే మార్చేస్తానన్నాడు ఈశ్వర్. జీవితమంటే జారుడు బల్ల... కిందికి జారటమే.. పైకెగబాకాలన్నా జారిపోవటమే... పాకుడు రాయిమీద కాలు... సర్రున జారటమే... ఓసారి జారాక ఎన్నిసార్లు జారినా పెద్దగా బాధ తెలీదు.

కళ్లు మూసుకుని జర్రున అగాథాల్లోకి జారిపోయింది. చీకటి... అంధకారం... నాన్న చనిపోయినపుడు కన్పించిన కటికి చీకటి.. ఈశ్వర్ వంటి మీది చెమట వాసన.... తన శరీరం చితిమీద కాలుతున్న కమురు వాసన... కల్సిపోయి... తను వెనక్కి పరుగెత్తుతోంది. వేగంగా... బలంగా... జీవితంలో వెనక్కి ... యింకా వెనక్కి... ఈశ్వర్ ముందుకొస్తున్నాడు... ముందుకి.. యింకా ముందుకి... విస్కీ వాసన... వికారం... వాంతికైంది. ఎన్ని వికారాలు లోపలే లుప్తమైపోయాయో బైటికి రావడానికి భయపడి...

స్టేట్ ఛాంపియన్ షిప్ పోటీలు.. హైద్రాబాద్ స్టేడియంలో ఎనిమిది వందల మీటర్ల హర్డిల్స్... తను పరుగెత్తుతోంది.. బుల్లెట్లా... కసితో... కోపంతో... అసహ్యంతో... వివేక్గాడి పొట్టని చీల్చాలన్నంత కసి... ఈశ్వర్గాడి గుండెని ఛిద్రం చేస్తూ దూసుకెళ్ళాలన్నంత కోపం... పరుగు... పరుగు... కాళ్ళతో కసిగా నేలని విసిరికొడ్తూ... నమ్మిన నేల దగా చేస్తే నిలబడేదెట్టా... వుహు... తను నిలబడకూడదు... పరుగెత్తాలి... ఆత్మ




## ఇది ఏ అభిమానానికి చిహ్నం?

సినీ హీరోయిన్లు ఏం చేసినా వివాదమే అవుతుంది. చివరికి వారు ఎవరితో మాట్లాడినా, మాట్లాడిన వారితో సంబంధాలు అంటగట్టేస్తుంటారు. అలాంటిది ఏకంగా శరీరం మీద పచ్చబొట్టు పొడిపించుకుంటే ఇంకేమన్నా ఉందా? అదీ ఆటలకి సంబంధించిన లోగో వేయించుకుంటే ఆ అభిమానాన్ని ఏమనుకోవాలి? టాలీవుడ్ టాప్ హీరోయిన్ త్రిష కొత్త వివాదంలో చిక్కుకోబోతోంది. అదేమిటంటే... త్రిషకి ఆటలంటే చచ్చేటంత ఇష్టం అట! ఆ ఇష్టంతో తన ముంజేతి మీద స్పోర్ట్స్ టాటూను వేయించుకుంది. గతంలో రొమ్ము మీద టాటూ వేయించుకొని కొంత వివాదం సృష్టించింది. ఆ టాటూ ఎవరి మీదో అభిమానంతో వేయించుకున్నది కాదనీ, సరదాకి వేయించుకున్నానని జనాల్ని నమ్మించడానికి నానా తంటాలు పడింది త్రిష. ఇప్పుడీ చేతి మీద వేయించుకున్న టాటూ మరెంత వివాదాన్ని సృష్టిస్తుందో అన్న అనుమానాన్ని ఆమె సన్నిహితులు వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా తన ఇష్టాన్ని ఇలా బహిర్గతం చేయకుండా ఉండి ఉంటే మంచిదని వారు అంటున్నారు.

కవిత

# ఎమ్.ఎఫ్.హుస్సేన్ వర్ణదృశ్య జగత్తు

ప్రపంచమంతా నయనానందకరమైన సౌందర్య వర్ణ దృశ్యాలే
పరుగువెడుతున్న హుస్సేన్ గుర్రాలు వర్ణాతీతమైన కళా విశ్వాన్ని జయించటానికే
కేన్వాస్‌ల నిండా పరచుకున్న రంగుల్లో హరివిల్లుల వెల్లువలే
వెలుగు నీడల తాత్త్విక చింతనోద్వేగమే జీవితయాత్ర
సర్వత్రా ప్రకృతి చైతన్యదీప్తి శోభాయమాన దృశ్యపరంపరలై
కేన్వాస్ చట్రాల్లో చిద్విలాసాన్ని వొలకబోసుకున్నప్పుడు
ఆ వర్ణ ప్రపంచం ముందు హసిత బాష్పాలతో కళాభిమానులకు సమాధ్యవస్థ
స్వప్న సీమల్లో విహంగ విహారమంతా సప్తవర్ణాల సంగీతోత్సవమై
స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పారవశ్య నృత్యంతో ప్రేమోద్రేకాల వేడుక
సరిహద్దుల నెరగని విశ్వంకోసం హుస్సేన్ గుర్రాలు
రాగానురాగాల ప్రేమబంధాల పూలజల్లుల మధ్య
వేనవేల మైళ్ల పరుగులతో వచ్చి మన జీవితాల వాకిళ్లలో ఆగి సేద తీర్చుకుంటాయి..
ప్రేమ సందేశాన్ని మోసుకుని మళ్లీ పరుగు
మానవతా సౌందర్యార్ణవంలో వేదనాభరిత గానంలో
కొత్త తేజో లోకాలవేపు మనల్ని మేల్కొల్పుతాయి
హుస్సేన్ కుంచె కేన్వాస్‌పై ముద్దుల పాపాయై మురిసిపోతుంది.
అంతలోనే అమ్మా అమ్మా అని అమ్మకోసం వెతుక్కుంటూ
కన్నీళ్లు పెట్టుకుని లబాలబా రోదిస్తుంది
కన్నుమూసి కన్ను తెరిచేలోపల
ఈ దృశ్యాదృశ్యాల చట్రం గోడమీద వేలాడుతుంది
పర్వతారణ్యాలలో తపోదీక్షా బద్ధుడైన మహర్షి
మనమధ్య చెప్పుల్లేని పాదాలతో, తెల్లని దుస్తులతో ప్రత్యక్షమౌతాడు
సృష్టికర్త భగవంతుడే చిత్రించిన వర్ణ చిత్రం కదా ఈ ప్రపంచం
ఉభయ సంధ్యలను పులుముతుంది కాన్వాస్‌ల నిండా ఆ కుంచె
ఆ రంగులలో అన్నీ పావురాలే, అన్నీ రాయంచలే, అన్నీ రంగురంగుల పూలే
ఎర్రకోట బురుజుల మీద మువ్వన్నెల జెండా
వందేమాతరం గానంతో గొంతు కలిపి నాట్యం చేసే చిత్రం
ఇండియాగేట్ అమర వీరుల స్మారక చిహ్నానికి
పుష్ప గుచ్ఛాలను అలంకరించి సైనిక వందనం చేస్తుంది
వారణాశి వీధుల్లో గంగామాయిని ప్రార్థించి బిస్మిల్లాఖాన్
షెహనాయితో గొంతు కలుపుతుంది
కొలకత్తా వీధుల్లో దరిద్ర నారాయణులైన అభాగినుల గాయాలను
మదర్ థెరిస్సా ఐ ప్రేమౌషధాలను పూస్తుంది
చెప్పుల్లేని ఆ పాదాలు రాజ్‌ఘాట్‌కు నడిచివెళ్లి
రఘుపతి రాఘవ రాజారామ్
సబ్‌కో సన్మతిదే భగవాన్ అని ప్రార్థిస్తుంది
రంగురంగుల శాంతి కపోతాలు అక్కడ వాలి
కుహూఃకుహూః గానాలతో
శాంతి గీతాలాలాపిస్తాయి.



-శ్రీపతి

లేకున్నా పర్లేదు. పరుగులో మాత్రం ప్రాణం ఉంటే చాలు. గెలవాలి... పతకం తనది కావాలి...

చప్పట్లు... చప్పట్లు... తను వగరుస్తూ పడిపోయింది... వూపిరందడం లేదు. చచ్చిపోతుందా... యిప్పుడేమిటి ఎప్పుడో చచ్చిపోయిందిగా... తను గెల్చింది. కాదు తన మృతశరీరం గెల్చింది. మెడలో బంగారు పతకం... జీవచ్ఛవానికి బంగారు పతకం..., నాన్నా... చూశావా.. యిదిగో బంగారు పతకం నా మెళ్లో... నేను మాత్రం బంగారం కాదు నాన్నా... మురికి... నా వంటినిండా దుర్గంధం... నేను కాలిపోయిన బొగ్గులా.. కానీ పతకం చూశావా... ఆ మెరుపు చూడు... నా మొహంలో చీకటంటావా... శరీరమంతా చీకటేగా నాన్నా... నేనే చీకటి.. పతకం మాత్రమే బంగారం.

తను వెక్కి వెక్కి ఏడుస్తుంటే ఆనందం పట్టలేక ఏడుస్తోంది అనుకున్నారందరూ... తను పతకం గెల్చుకుంది. పేపర్లనిండా తన గురించే.. ఎన్ని సార్లు చదువుకున్నా తనివి తీరనంత హాయిగా.. ఆనందంగా.. తను గెల్చింది నిజమే.. కాని జీవితంలో ఓడిపోయింది. ఘోరంగా.

కీర్తి ఆలోచనల్లోంచి బైట పడి గోడ గడియారం కేసి చూసింది. సమయం మధ్యాహ్నాం రెండు గంటలు.. ఆకలి కడుపులో అవిశ్రాంతంగా కదుల్తోంది.. కసిగా అరుస్తోంది. ఉదయం రమ యిప్పించిన కాఫీ నీళ్లే.. యింట్లో డబ్బులు లేవు. రమని అడిగి ఉండాల్సింది. యిప్పటికే ఎంత అప్పుందో రమకి? బాకీ బతుకు తనది.. బానిస బతుకు.. అప్పుడు పతకం గెలవాలన్న కోరిక్కి... యిపుడు ఆకలికి...

గోడమీద అద్దాల షోకేస్‌లో మేకుకి వేలాడుతూ గోల్డ్ మెడల్... తను గెల్చుకున్న పతకం... తను ఓడిపోతేనే కాని గెల్చుకోలేని పతకం... వద్దంటున్నా వినకుండా అమ్మ చేయించిందా షోకేస్... ఉదయం లేస్తూనే కళ్ళకు కన్పించాలని.. మేకుకి వేలాడదీసిన నా పతనం... అమ్మేస్తేనో.. ఎన్ని డబ్బులొస్తాయో... యిలా అనుకోవటం ఎన్ని వందల సార్లో.. ఆకలి జూలు విదిల్చినపుడల్లా పతకం గుర్తొస్తుంది. కానీ దాన్ని అమ్మగలదా తను.. అమ్ముడు పోయి కదా దాన్ని స్వంతం చేసుకుంది? ఏ పతకం కోసం తను పతనమైందో దాన్ని పారేసుకుంటే తన పతకానికి అర్థమే ఉండదు. పతనానికి అర్థాలు అపార్థాలు కూడా ఉంటాయా? పతనం పతనమేగా...

ఒకప్పుడు ఛాంపియన్ కావాలనే ఆశయంతో బురదలో దొర్లింది. యిప్పుడు ఆకలికోసం వంటికి బురద పూసుకుని తీరాల్సిన పరిస్థితి. అప్పుడే మురికిని మరికొంత భరించి ఉంటే నేషనల్ ఛాంపియన్ అయ్యేది. పందిలా పొర్లే ఈశ్వర్‌ని భరించినట్లే.. బురద ఒక్కటే... పందులే మారుతుంటాయి.

'రేపు ఓ అడ్రస్ యిస్తాను. అక్కడికెళ్లు. రాత్రి అక్కడే గడుపు. నువ్వు నేషనల్ పోటీలకు సెలక్ట్ కావటం ఖాయం' అన్నాడు ఈశ్వర్. బ్రోకర్ వెధవ... లోఫర్ వెధవ... వాడి మొహాన తుపుక్కున ఉమ్మి ఊసి వచ్చేసింది.

ఉమ్మి.. ఎన్ని క్రిములుంటాయో.. ఉమ్మిలో నేనా... ఎన్నెన్ని ద్రవాలో.. ఎన్నెన్ని రోగాలో... దుర్గా లాడ్జిలో డబ్బులు తీసుకుని మొదటిసారి వాడికి ముద్దిచ్చినపుడు... వాడికి తన శరీరంతో ఆడుకునే అధికారం యిచ్చినపుడు... ఎన్నిసార్లు చచ్చిపోయిందో... రోజుకి ఎన్ని చావులో.....

ఏమైతేనేం ఆకలిని చంపేసింది. యిపుడు ఆకలి వేయటం లేదు. కడుపు నిండా తింటోంది... అన్నమేనా... బురద... దుర్గంధం...

అప్పటికి దుర్గా లాడ్జిలో మరణించటం ప్రారంభించి ఆర్నెల్లు...

ఆ రోజు రాత్రి నోట్లు తీసుకున్న పాపానికి గుంటనక్క మొహం వేసుకున్న నీటి గుర్రానికి నోటికి ఫలహారంలా మారి మరణిస్తున్నపుడు తలుపు మీద టక్ టక్ అని శబ్దమైంది. కీర్తి బైటికొచ్చింది. పోలీసులు...

అరెస్ట్ చేసి స్టేషన్‌కి పిల్చుకెళ్ళారు.. అక్కడే గద్దలా కూచుని కన్పించాడు రవికుమార్. ఓ పేరున్న పత్రిక్కి న్యూస్ రిపోర్టర్. కీర్తిని చూసి వంకరగా నవ్వాడు. చిక్కావుగా నా చేతికి చూడెలా కాల్చుకు తింటానో అన్నట్లు నవ్వాడు.

కీర్తికి జిల్లా స్థాయిలో ఫస్ట్ ప్రైజ్ వచ్చినపుడు డేగలా వాలిపోయాడు. 'నీ గురించి పేపర్లో రాస్తాను. నిన్ను చుక్కల లోకాలకు తీసుకెళ్తాను. నాతో కొన్ని రాత్రుళ్ళు గడిపితే చాలు.. నీ కీర్తి దేశమంతా వ్యాపించేలా చేస్తాను. నిన్ను సెలబ్రిటీని చేస్తాను' అన్నాడు. తను ఎడం కాలి చెప్పు తీసి సమాధానం చెప్పింది. అందుకే వాడికి కసి.. పగ...

కోర్టులో ఫైన్ కట్టి యింటి కొచ్చిన కీర్తి గడియారం వైపు చూసింది. రాత్రి తొమ్మిది గంటలు.. అన్నం తినాలనిపించలేదు. శరీరాన్ని కొద్దికొద్దిగా కరిగించి కొనుక్కున్న అన్నం... సయించలేదు. రవికుమారే గుర్తొస్తున్నాడు. వాడేదో చేస్తాడు. వూర్కోడు.

రాత్రంతా కీర్తికి నిద్ర పట్టలేదు. మాగన్నుగా నిద్ర పట్టినా భయంకరమైన పీడకలలొచ్చి ఉలిక్కి పడి లేచి కూచుంది.

ఉదయం ఆరింటికే లేచింది. బైటికెళ్ళాలంటే భయమేసింది. ఒకప్పుడు చీకటంటే భయం.. ఈ రోజు వెల్తురంటే మరింత భయమేస్తోంది. పక్కింటి కుర్రాణ్ణి పంపించి పేపర్ తెప్పించుకుంది. వణికే చేతుల్తో తన పేరు కోసం వెతుక్కుంది. 'పొట్ట గడవక పడుపు వృత్తి చేస్తున్న స్టేట్ ఛాంపియన్ కీర్తి'... ఐపోయింది... అంతా ఐపోయింది. ఏ పేపర్ల నిండా తను గెల్చుకున్న బంగారు పతకం గురించి పతాకస్థాయిలో రాశారో అవి పేపర్లనిండా తను లాడ్జిలో విటునితో దొరికిన వైనం గురించి చిలువలు పలువలుగా కల్పించి రాశారు.

యిపుడు ప్రభుత్వం మేల్కొంటుంది. మేల్కొన్నట్లు నటిస్తుంది. క్రీడా సంస్థలు జాలిని చొంగలా కారుస్తాయి. స్టేట్ ఛాంపియన్‌కి పట్టిన గతికి చింతిస్తాయి. ఆపన్న హస్తం అంటూ వచ్చి తన జోలెలో బిచ్చం వేస్తాయి. బియ్యం వేయడానికొచ్చిన వాళ్లు తన గుండెల వైపే చూస్తారు. తన ఆకలి... కడుపాకలి తీర్చుకోడానికి మరొకరికి తను ఆహారం కావాలి.. గుట్టుగా తన గుండెల్ని ముక్కలు చేసుకుంటుంటే యిపుడంతా రచ్చయిపోయింది. ఆకలిని భరించవచ్చేమో కాని అవమానాన్ని భరించటం కష్టం...

కీర్తి తలారా స్నానం చేసింది. వదులుగా జడవేసుకుంది. తనకు నచ్చిన గులాబీ రంగు చీర కట్టుకుంది. షోకేస్‌లోంచి గోల్డ్ మెడల్ తీసి మెళ్ళో వేసుకుంది. ఫ్యాన్‌కి చున్నీ బిగించి, స్టూల్‌మీద నిలబడి గడియారం వైపు చూసింది. నాన్న కొనిచ్చిన గడియారం... చావు డప్పులా టిక్కు టిక్కుమంటూ..

ఏడు కావటానికింకా మూడు నిముషాలుంది. ఆ గడియారం ఏడు గొంటలు కొట్టడం తను వినలేదు .. వినకూడదు. కీర్తి స్టూల్‌ని బలంగా తన్ని ఫ్యాన్‌కు వేలాడింది. గొంతుకి చున్నీ బిగుసుకుంటోంది. ప్రాణం పోతోంది... తను చచ్చిపోతోంది. చివరిసారిగా చచ్చిపోతోంది... పరుగు... వేగంగా.. అతివేగంగా.. శూన్యంలో పరుగు... అనంతంలోకి పరుగు... సునాయాసంగా... గాలితో సమానంగా.. పరుగెత్తుతోంది. ఈ దారిలో హార్డిల్స్‌లేవు.. వివేకులు లేరు... ఈశ్వర్లు లేరు.. కుక్కలు పందులు లేవు.. కమ్మటి మల్లెల వాసన.. తనకిష్టమైన మల్లెలు.. గాలికంటే వేగంగా పరుగు.. తను పరుగులరాణి... పతకం తనదే.. పతనం లేని పతకం...ట్రాక్ మీద ఎన్నెన్ని పరుగులు... జీవితంలో ఎన్నెన్ని పరుగులు.. అన్నిటికన్నా ఈ పరుగు ఉత్తమంగా ఉంది... పైకెగబాకటానికి దిగజారాల్సిన అవసరం లేని పరుగు... అవిగో శిఖరాలు.. సమున్నతంగా... తను వాటిని దాటుకుంటూ...

గడియారం బలహీనంగా ఏడుసార్లు మూలిగి ఆగిపోయిన శబ్దం విన్పించనంత దూరాలకు వెళ్ళిపోయింది కీర్తి.

*

చిరునామా
సయ్యద్ సలీం
ఫ్లాట్ నెం. 306, జె.బి.అపార్ట్‌మెంట్స్,
దోమలగూడ, హైదరాబాద్.
సెల్: 98493 86327



## సీరియస్‌గా తీసుకుంటున్నా!

మీరాచోప్రా సీరియస్‌గా తీసుకుంటోంది వివాదాలను కాదట! సినిమాలనట! పవన్ కల్యాణ్ సరసన 'బంగారం'లో హీరోయిన్‌గా నటించిన మీరాచోప్రాకి ఆ తరువాత సినిమాలకన్నా వివాదాలే ఎక్కువగా ఎదురయ్యాయి. 'బంగారం' తరువాత నితిన్‌తో 'సత్యం శివం సుందరం'లో నటించినా, ఆ సినిమా ఇప్పటి వరకూ విడుదలకు నోచుకోలేదు. ఇప్పుడు తాజాగా 'మారో' పేరుతో ఆ సినిమా విడుదలకు సిద్ధం అవుతోంది. బాలీవుడ్, కోలీవుడ్, టాలీవుడ్‌లలో పలువురు హీరోలతో రొమాన్స్‌లు నడుపుతోందంటూ మీరాచోప్రా మీద పుకార్లు షికార్లు చేశాయి. అవన్నీ ఒట్టిదేననీ, తనకు ఎవరితోనూ సంబంధం లేదంటూ వివరణలు ఇచ్చుకోవడానికి మీరా టైమంతా గడిచిపోయింది. ఇప్పుడు అలాంటి వివాదాలకు దూరంగా ఉంటాననీ, తన మీద వచ్చే పుకార్లను సీరియస్‌గా తీసుకోకుండా, నటనకే పూర్తి సమయం కేటాయిస్తానని అంటోంది. ఇంకేం మీరా ఇంటి ముందు నిర్మాతలు క్యూ కట్టడం ఖాయం అని కొందరంటున్నారు.